
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 19 అక్టోబరు 2024

జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేయండి

గుజరాతీపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పోస్టుల భర్తీకి సంబంధించి అభ్యర్థుల మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో పొందుపర్చామని డీఈవో తిరుమల చైతన్య తెలిపారు. వీటిని పరిశీలించి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా.. ఈ నెల 20న సాయంత్రం నాలుగు గంటలులోగా జిల్లా సమగ్రశిక్షా కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. అభ్యర్థులు ఈ నెల 21న ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్‌లు తీసుకుని కార్యాలయానికి హాజరు కావాలని తెలిపారు.


తేలుకుంచిలో విదేశీ పక్షులు

అయ్యో.. అతిథీ!

విదేశాల నుంచి వచ్చే పక్షులు అవి. ఏటా వేల కిలోమీటర్ల నుంచి వస్తాయి. ఏడు నెలలు ఇక్కడే ఉంటాయి. పర్యాటకులకు కనువిందు చేస్తాయి. సంతానోత్పత్తి తర్వాత తిరిగి వెళ్తాయి. అయితే వీటి సంరక్షణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వాటి గుడ్లు పగిలి పోతున్నాయి. కొన్ని పక్షులు మృత్యువాత కూడా పడుతున్నాయి. పరిసరాల్లో చెరువులను అభివృద్ధి చేస్తే వాటిని ప్రయోజనం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

- విలవిల్లాడి పోతున్న విదేశీ పక్షులు
- తేలుకుంచి విడిది కేంద్రంపై నిర్లక్ష్యం
- వైసీపీ పాలనలో పట్టించుకోని పాలకులు
- ఏటా వందలాది మూగజీవాలు మృత్యువాత

ఇచ్ఛాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విదేశీ విహంగ కేంద్రాల్లో ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి ఒకటి. ఏటా వేలాది కిలోమీటర్లు ప్రయాణించి విదేశీ పక్షులు ఇక్కడకు చేరుకుంటాయి. ఏడాదిలో సుమారు ఏడు నెలల పాటు ఇక్కడే ఉంటూ స్థానికులను కనువిందు చేస్తాయి. సంతానోత్పత్తి తరువాత తిరిగి వెళ్లిపోతాయి. గత ఐదేళ్లలో వీటి సంరక్షణకు వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో అవి సంతానోత్పత్తి చేసే క్రమంలో గుడ్లతో పాటు పక్షులు చెట్ల కింద నుంచి జారిపడి మృత్యువాతపడుతున్నాయి. అటవీ శాఖ, పర్యాటక శాఖ అధికారులు వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ అనుకూలతలతోనే..


తేలుకుంచి.. చిత్తడి, తంపర నేలలకు ప్రసిద్ధి. ఇక్కడ పక్షులకు సమృద్ధిగా ఆహారం లభిస్తుంది. ఈ ప్రాంతం సంతానోత్పత్తికి అనుకూలమైన వాతావరణం. అందుకే విదేశాల నుంచి వలస పక్షులు ఇక్కడకు వస్తుంటాయి. సైబీరియా, జర్మని, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, హంగేరి దేశాల నుంచి సుమారు 6 వేల కిలోమీటర్లు ప్రయాణించి ఏటా సెప్టెంబరు, అక్టోబరులో ఇక్కడకు చేరుకుంటాయి. ఆరేడు, నెలల పాటు ఇక్కడే ఉంటాయి. గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేస్తాయి. పిల్లలు పెద్దయ్యాక.. మార్చి, ఏప్రిల్‌లో తిరుగు పయనమవుతాయి. ఇవి వస్తే పంటలు బాగా పండుతాయని రైతుల ప్రగాఢ నమ్మకం. ప్రస్తుతం పెద్ద ఎత్తున ఇక్కడకు విదేశీ పక్షులు చేరుకున్నాయి. కాగా సంతోనాత్పత్తికి సంబంధించి ఎటువంటి ఏర్పాట్లు జరగకపోవడంతో గుడ్లతో పాటు పక్షులు చెట్టు నుంచి జారిపడి మృత్యువాత పడుతున్నాయి. 2018లో తితలీ తుఫాన్ సమయంలో వందలాది విదేశీ పక్షులు మృతిచెందాయి. కనీసం చెట్లకు నెట్లు(వలలు) కూడా ఏర్పాటు చేయలేదు. దీనికితోడు కోతులతో పక్షులకు కష్టాలు తప్పడం లేదు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్రాన్ని గాలికొదిలేసింది. పరిసరాలు అధ్వానంగా మారాయి. పక్షుల మల, మూత్ర విసర్జనతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు దుర్గంధం మాటున గడపాల్సి వస్తోంది. కనీసం చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులను అభివృద్ధి చేస్తే పక్షులకు కొంతవరకూ ఉపయోగపడే అవకాశముంది.


తితలీ తుఫాన్ సమయంలో విలవిల్లాడిన విదేశీ పక్షులు

పర్యాటకాభివృద్ధికి అవకాశం

అటవీ, పర్యాటక శాఖ సంయుక్తంగా చర్యలు చేపడితే విదేశీ పక్షుల విడిది కేంద్రం అభివృద్ధి చెందే అవకాశముంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ కొన్నిరకాల నిర్మాణాలు చేపట్టారు. 2019లో టీడీపీ ప్రభుత్వం కీలక ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. ఎన్నికల తర్వాత అధికారం మారడంతో అవన్నీ బుట్టదాఖలయ్యాయి. అప్పట్లో

(మిగతా 6వ పేజీలో...)






సీఎం సమీక్షలో జిల్లా నేతలు

శ్రీకాకుళం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం విజయవాడలో నిర్వహించిన సమీక్షకు జిల్లా నుంచి మంత్రి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఇసుక, లిక్కరు వ్యాపారాల్లో ఎవరూ జోక్యం చేసుకోవద్దు అని రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులను ఆదేశించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల రాష్ట్రాన్ని చెత్త మయం చేసిందని.. చెత్త తీసేందుకే రూ.కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు. ఇసుక, లిక్కర్ విషయంలో కొత్త పాలసీలను పక్కాగా అమలు చేయాలన్నారు. విశ్వసనీయతతో పని చేయాలని సూచించారు. పారదర్శకంగా ప్రభుత్వాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా నుంచి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, గౌతు శిరీష, బెందాళం అశోక్, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.


తుంగతంపరలోని రాధాగోవిందస్వామి ఆలయం

చిన్న ఆలయాలకు ఊరట

- దూప,దీప, నైవేద్యాలకు ఆర్థిక సాయం పెంపు

హిరమండలం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా దేవాలయాల్లో దూప,దీప, నైవేద్యాలకు ఆర్థిక సాయం పెంచుతూ కూటమి ప్రభుత్వ నిర్ణయం తీసుకొంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డీడీఎన్ పథకం కింద చిన్న ఆలయాలకు ప్రస్తుతం అందించే సాయాన్ని.. రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచింది. ఈ నెల నుంచే దీనిని అమలు చేయనున్నట్లు.. దేవదాయశాఖ ప్రత్యేక కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. 2015లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చిన్న ఆలయాలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. తర్వాత దానిని రూ.5వేలకు పెంచారు. ఇందులో సగం అర్చకులకు ఇవ్వగా.. మిగిలిన సొమ్ముతో ఆలయ నిర్వహణ చేపట్టేవారు. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ సీఎం చంద్రబాబు.. చిన్న ఆలయాలకు ఆర్థిక సాయాన్ని రెండింతలు పెంచడంతో అర్చకుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- జిల్లాలో దూప,దీప, నైవేద్యాల కింద ఆర్థిక సాయం పొందే దేవాలయాలు 139 ఉన్నాయి. వీటిలో వార్షిక ఆదాయం రూ.50వేలు లోపు ఉన్న ఆలయాలే

(మిగతా 6వ పేజీలో...)

దీపావళి సంబరాలకు ఏర్పాట్లు

- టూరిజం సర్క్యూట్‌లో బస్సులు నడపాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రహదారులు, భవనాల గ్రౌండ్‌లో డచ్ బిల్డింగ్ వద్ద దీపావళి సంబరాలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక, సంబంధిత అధికారులతో ఆయన సమావేశమయ్యారు. 'దీపావళి సంబరాలకు సంబంధించి ఆర్డీవో, మునిసిపల్ కమిషనర్, పర్యాటక శాఖాధికారి ఏర్పాట్లు చేయాలి. జిల్లాలో సిక్కోలు సంబరాలను జరుపుకొందాం. ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేద్దాం. జిల్లాలో టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలి. సర్క్యూట్‌లో బస్సులను నడపాలి. పెద్దపాడు చెరువును అభివృద్ధి చేయాలి. విజయాదిత్యపార్కు చుట్టూ ఫెన్సింగ్ వేయాలి. వజ్రపుకొత్తూరు మండలంలో శివసాగర్ బీచ్ వద్ద సమస్యలు లేకుండా చూడాలి' అని ఆదేశించారు. పూడిలంక బీచ్ వద్ద ఐలాండ్, మెట్టూరులోని వెంకులూరు బీచ్‌లో ఎర్రమట్టి దిబ్బలు, ఇతర ప్రాజెక్టులు, గ్రామీణ పర్యాటకం తదితర విషయాలపై చర్చించారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, వజ్రపుకొత్తూరు తహసీల్దార్, వంశధార డీఈఈ సురేష్‌కుమార్, పర్యాటకశాఖాధికారి నారాయణరావు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, ఏఈ మదన్‌మోహన్, హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి 6లో

గొల్లుమంటున్న.. గోపాలసాయి

- చినుకు పడితే గ్రామస్థులకు దడే
- కోతకు గురవుతున్న కాలువ
- రక్షణ గోడ నిర్మించి ఆదుకోవాలని వినతి


- మందస మండలం గోపాలసాయి గిరిజన గ్రామం పక్కనుంచే వెళ్తున్న డబార్సింగి రిజర్వాయర్ వరద కాలువతో కోతకు గురవుతున్న పరిస్థితి ఇది. ఏటా వరదలతో కోతకు గురై సుమారు పది అడుగులు గ్రామం కొట్టుకుపోతుండటంతో గ్రామస్థులు బిక్కుబిక్కు మంటూ జీవనం గడుపుతున్నారు. ఇక్కడ రక్షణగోడ నిర్మించాలని వేడుకుంటున్నారు.

హరిపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గిరిజన గ్రామం అది. మండల కేంద్రానికి సుదూరంగా ఉంటూ సమస్యలతో సతమతమవుతోంది. సుమారు 60 నివాస గృహాలున్న ఈ గ్రామంలో చినుకు పడితే చాలు.. ఎక్కడ ముప్పు వాటిల్లుతుందోనని గ్రామస్థులను భయాందోళన వెంటాడుతోంది. ఇదీ మందస మండలం బొగాబంద పంచాయతీ గోపాలసాయి గిరిజన గ్రామ దుస్థితి. రైతుల సౌకర్యార్థం నిర్మించిన డబార్సింగి రిజర్వాయర్ నిండా నీరుంటే ఆ గ్రామ ప్రజల

(మిగతా 6వ పేజీలో...)


- డబార్సింగి రిజర్వాయర్ వద్ద మిగులు నీరు ప్రవహించే వరద కాలువలో నిర్మించిన సిమెంటు కట్టడాలు ఇవి. వరదలకు ధ్వంసమై కనీస మరమ్మతులకు నోచుకోక గత ఐదేళ్లు నిర్లక్ష్యానికి గురయ్యాయి. దీంతో వరద వస్తే నీరు నేరుగా గోపాలసాయి గ్రామంలో చేరుతోంది. వీటికి మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆకాశం నీ హద్దురా... నైపుణ్యం ఉండాలిరా!

- నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు
- ప్రత్యేక శిక్షణతో ఉపయోగాలు
- స్కిల్ హబ్‌ల ద్వారా శిక్షణ

6లో



ఎన్టీఆర్ కాలనీలో చోరీ

- మూడు తులాల బంగారం, రూ.60 వేలు నగదు అపహరణ


రోదిస్తున్న బాధితులు

కి'లేడీ' వ్యవహారంపై ఆగ్రహం

- బంగారం బిస్కట్ల ఆశ చూపి.. రూ.కోటి దోచేసిన మహిళ
- పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని బాధితుల ఆవేదన
- న్యాయం చేయాలని వేడుకోలు

8లో

ఆకాశం నీ హద్దురా..

నైపుణ్యం ఉండాలిరా!

- నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు
- ప్రత్యేక శిక్షణతో ఉపయోగాలు
- స్కిల్ హబ్‌ల ద్వారా శిక్షణ



అరసవల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చేతిలో డిగ్రీ పట్టా ఉంటే చాలు... ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోవచ్చు అనే రోజులు పోయాయి. డిగ్రీ ఒక్కటే కాదు.. అదనంగా నీకు ఉన్న అర్హతలు ఏంటో చెప్పు అంటున్నాయి ఉద్యోగాలిచ్చే సంస్థలు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు... సమాజంతో పాటు సంస్థల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యా లను పెంచుకోగలిగినప్పుడే ఉపాధి అవకాశాలను సొంతం చేసుకోగలరన్నది నిర్వివాదాంశం. తాము చదువుకున్న కోర్సులతో పాటు... వాటికి సంబంధించిన సాంకేతిక విషయాలపై పూర్తి పట్టు సాధించుకోవడం ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలోనే యువతలో నైపుణ్యాలను పెంచి.. వారికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రస్తుతం జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.



స్కిల్ హబ్‌లో శిక్షణకు హాజరైన యువత

● జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా..

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో నైపుణ్యాలను పెంపొందించేందుకు.. తద్వారా వారికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ పని చేస్తుంది. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 192 స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేసింది. జిల్లాకు సంబంధించి శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గంలో గల అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 8 స్కిల్ హబ్ సెంటర్లు యువతకు ఉపాధి కల్పనకు శిక్షణ ఇస్తున్నాయి.

● ఎక్కడెక్కడ అంటే..

1) ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసన్నపేట, 2) ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాతపట్నం, 3) ప్రభుత్వ ఐటీఐ/డీఎల్‌టిసి శ్రీకాకుళం, 4) ప్రభుత్వ ఐటీఐ, ఎచ్చెర్ల, 5) డా.వి.కణితి ప్రభుత్వ ఐటీఐ, పలాస, 6) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆమదాలవలస, 7) ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి, 8) ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బారువలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● ప్రభుత్వమే బాధ్యత తీసుకుని..

గతంలో కొన్ని ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో శిక్షణ ఇచ్చేవారు. ఇప్పుడు నేరుగా ప్రభుత్వమే స్కిల్ హబ్స్ ద్వారా ఉచిత శిక్షణను అందిస్తోంది. శిక్షణ పూర్తయ్యాక అభ్యర్థులు ఎంతమేరకు నైపుణ్యాలను సాధించారనేది తెలుసుకునేందుకు అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహిస్తుంది. అందులో ప్రతిభ కనబరిచిన వారికి ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాలు కల్పిస్తుంది. ప్రతి స్కిల్ హబ్‌లో బ్యాచ్‌కు 30 మంది చొప్పున.. రెండేసి బ్యాచ్‌లకు శిక్షణను అందిస్తారు. వీటి కాలవ్యవధి అంశాన్ని బట్టి మూడు నుంచి నాలుగు నెలలు ఉంటుంది.

● స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేలా..

ఎచ్చెర్లలో స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు 20 రంగాల్లో శిక్షణ ఇచ్చి.. స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మరిన్ని స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలలు ఏర్పాటు చేసి...యువతకు శిక్షణ ఇచ్చి... పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధంగా రాష్ట్రంలో యువతకు 20 రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు గాను 30 స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలలను ఏర్పాటు చేసింది.

● ఏఏ కోర్సులంటే..

ఆంధ్రప్రదేశ్‌లో డిగ్రీ, లేదా పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను అందించేందుకు ఎచ్చెర్లలోని స్కిల్ కళాశాలలో పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సు (ఏదైనా డిగ్రీ, 4 నెలల కాలం), ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ కోర్సు (సోషల్ వర్క్/ సైకియాట్రీ/ సోషియాలజీ/ సోషల్ సైన్స్/పబ్లిక్ హెల్త్ లేదా మెడికల్ గ్రాడ్యుయేట్, లేదా నర్సింగ్ గ్రాడ్యుయేట్) అర్హత కలిగి, 20-30 సంవత్సరాల లోపు వయసు గల వారికి ఉచిత శిక్షణ, ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగావకాశం కల్పిస్తారు. ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన వారికి 4 నెలల శిక్షణ అందించి సేల్స్ సూపర్‌వైజర్లుగా అవకాశం కల్పిస్తున్నారు.

● డిగ్రీ విద్యార్థులకు..

2023-24 సంవత్సరానికి గాను జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా స్కిల్ సెంటర్స్ ద్వారా 4,144 మంది డిగ్రీ కాలేజీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో సీఆర్‌టీ కోర్సు ద్వారా ఆప్టిట్యూడ్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ స్కిల్స్‌లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తారు. అలాగే మహీంద్రా ప్రైడ్ క్లాస్‌రూమ్ ప్రోగ్రాం ద్వారా ఆఫ్‌లైన్‌లో సాఫ్ట్‌స్కిల్స్ లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ అందిస్తున్నారు.

● స్టార్ట్ యువర్ బిజినెస్..

స్టార్ట్ యువర్ బిజినెస్... జనరేట్ యువర్ బిజినెస్ అనే అంశాలపై కూడా శిక్షణ ఇస్తున్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, పరిశ్రమల అనుమతులు, బ్యాంకింగ్ రంగం, స్టాండ్ అప్ ఇండియా, పీఎంఈజీపీ, ఇతర ఎస్ఎస్ఓ రుణాలకు సంబంధించి 8 రోజుల పాటు యువతకు శిక్షణను అందిస్తున్నారు. అభ్యర్థులకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించి, శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు బ్యాంకు రుణం అందేలా ప్రోత్సాహాన్ని అందిస్తారు. నూతన వ్యాపార ప్రారంభానికి కావలసిన అంశాలపై శిక్షణ ఇస్తారు.

● నిరుద్యోగ యువత వినియోగించుకోవాలి..



జిల్లాలోని నిరుద్యోగ యువత, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు స్కిల్ సెంటర్ల ద్వారా అందించే నైపుణ్యాభివృద్ధి శిక్షణను వినియోగించుకోవాలి. తద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఈ సెంటర్ల ద్వారా ఉచిత శిక్షణ, ఉద్యోగ నియామకాలను చేపడతాం. జిల్లా యువత మరింత అవగాహన పెంచుకుని... స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల సేవలను పూర్తిగా వినియోగించుకోవాలి.

-సాయికుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి

అయ్యో.. అతిథీ!

(5వ పేజీ తరువాయి) తేలుకుంచి కేంద్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఒడిశా, ఏపీకి సరిహద్దు ప్రాంతం కావడం, చెంతనే సముద్ర తీరం ఉండడంతో రెండు రాష్ట్రాలకు పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వం పట్టించు కోలేదు. గత ఐదేళ్లలో పర్యాటక శాఖకు ఎటువంటి కేటాయింపులు చేయలేయలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా స్పందించి.. పక్షులకు రక్షణ కల్పిస్తూ.. పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించాలని ఈ ప్రాంతవాసులు, పర్యాటకులు కోరుతున్నారు. పక్షుల రక్షణ కోసం నెట్లు, పక్షులను వీక్షించేందుకు టవర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● పక్షుల బాధలు వర్ణనాతీతం..

విదేశీ పక్షులు వచ్చినప్పుడు చాలా ఆనందం వేస్తుంది. అవి వస్తేనే ఈ ప్రాంతంలో సమృద్ధిగా పంటలు పండుతాయని ప్రగాఢ నమ్మకం. కానీ ఈ కేంద్రంలో పక్షులు పడే బాధలు వర్ణనాతీతం. సరైన ఏర్పాట్లు లేక చెట్లపై నుంచి జారిపడి సంతానోత్పత్తి గుడ్లు పగిలిపోతుంటాయి. పక్షులు సైతం మృత్యువాత పడుతుంటాయి. ఆ సమయంలో చాలా బాధేస్తోంది.

-చంద్రశేఖర్‌రెడ్డి, తేలుకుంచి

● పర్యవేక్షణ కరువు..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విదేశీపక్షులపై కనీస స్థాయిలో పర్యవేక్షణ లేకుండా పోయింది. అటవీశాఖ, పర్యాటక శాఖ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ విదేశీ పక్షుల కేంద్రంపై దృష్టి పెట్టాలి.

- మేరుగు సూర్యనారాయణరెడ్డి, తేలుకుంచి

● పక్షుల రాకతో పండగ..

విదేశీ పక్షుల రాకతో గ్రామానికి పండగ వాతావరణం వస్తుంది. పచ్చనిచెట్ల మధ్య పక్షులు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తాయి. నా వయసు 80ఏళ్లు. నేను చిన్నప్పుడు వేల సంఖ్యలో విదేశీ పక్షులు వచ్చేవి. అటవీ శాఖ అధికారులు సౌకర్యాలు కల్పించకపోవటంతో పక్షులు రాను రాను తగ్గుముఖం పడుతున్నాయి.

- దక్కత నీలమ్మ, తేలుకుంచి

● ప్రత్యేక దృష్టి..

తేలుకుంచి విదేశీ పక్షుల విడిది కేంద్రంపై ప్రత్యేక దృష్టిపెట్టాం. అటవీశాఖపరంగా మొక్కలు నాటి సంరక్షిస్తున్నాం. పక్షుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నాం. శాశ్వత నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు చేశాం. రక్షణ చర్యల్లో భాగంగానే యాక్షన్‌ప్లాన్ తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. అనుమతి వచ్చిన వెంటనే పనులు చేపడతాం. నెట్లు, టవర్ ఏర్పాటు కోసం ప్రైవేటు వ్యక్తుల స్థలాలను అడగ్గా వారు అంగీకరించలేదు. శ్మశానం వద్ద ప్రభుత్వ స్థలం ఉన్నా.. టవర్ ఏర్పాటుకు అనుకూలం కాదు. పూర్తిస్థాయిలో నిధులు మంజూరైతే అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం.

- ఐ.రాము, డిప్యూటీ అటవీరేంజ్ అధికారి

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 18: రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డీలర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎరువుల, విత్తనాల డీలర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ 'ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురు డీలర్లపై జరిమానాలు విధించాం. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను, విత్తనాలను అందుబాటులో ఉంచాలి. రానున్న సీజన్లో 77,176 హెక్టార్లలో రబీకి సాధారణ సాగు విస్తీర్ణం అంచనా వేశాం. ఇందుకు గాను 40,225 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉంది. ప్రస్తుతం జిల్లాలో 9793 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. అత్యధికంగా 29,930 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంద'ని తెలిపారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, జిల్లా కోపరేటివ్ అధికారి బి.నగేష్, డీసీసీబీ సీఈవో వరప్రసాద్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రమణి, హోల్‌సేల్ ఎరువుల అసోసియేషన్ ప్రతినిధులు వైశ్యరాజు గోవిందరాజు, పొట్నూరు శ్రీరాములు, బోయిన గోపాల్, వ్యవసాయశాఖ ఏడీలు, ఎరువుల కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



వజ్జ బాబూరావుతో మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖాధికారులు

పలాసలో కొత్త పారిశ్రామికవాడకు చర్యలు

● జిల్లా పరిశ్రమల అధికారులతో చర్చించిన ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ

పలాస, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో జీడి పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు అనేక మంది ఉన్నారని, కొత్త పారిశ్రామికవాడ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జ బాబూరావు జిల్లా పరిశ్రమల శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు జీఎం విజయ్‌రత్నం, ప్రమోషన్ అధికారులు రఘునాథ్, ఉమామహేశ్వరరావు తదితరులు ఆయనను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. జిల్లాలో అతివేగంగా అభివృద్ధి చెందుతున్న పలాస జీడి పరిశ్రమలకు కొత్త పారిశ్రామిక వాడ ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. దీనికి సంబంధించి ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రభుత్వానికి నివేదించారన్నారు. 60 ఎకరాల స్థలం కేటాయించాలని సూచించారు. దీనికి అధికారులు స్పందిస్తూ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

జీడి పరిశ్రమల సముదాయ అభివృద్ధికి...

జీడి పరిశ్రమల సముదాయం అభివృద్ధికి చర్యలు తీసుకుని వ్యాపారాభివృద్ధికి సహకరిస్తామని జిల్లా పరిశ్రమలశాఖ జీఎం, జేడీ విజయ్‌రత్నం తెలిపారు. శుక్రవారం స్థానిక ఇంగిలిగాం పారిశ్రామిక పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపార సంఘ అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావు, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి శాసనపురి శ్రీనివాసరావు తదితరులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వ్యాపారులు పెరిగి నందున కొత్త పారిశ్రామికవాడ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యాపారులు ఎస్.పాండురాంగారావు, సుధాకర్, శ్రీనివాస్, భారత జీడి పరిశ్రమల సంఘం సభ్యుడు మల్లా కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లుమంటున్న..

గోపాలసాయి



గోపాలసాయి గిరిజన గ్రామం..

(5వ పేజీ తరువాయి) కంటిమీద కునుకు ఉండని పరిస్థితి. రిజర్వాయర్ మిగులు జలాలు ఈ గ్రామం పక్కనుంచే ప్రవహిస్తుంటాయి. దీంతో నీరు ప్రవహించే కాలువ కోతకు గురై గ్రామంలోకి నీరు చేరి.. ముంపు ముప్పు వాటిల్లుతోందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడనం వస్తే చాలు.. తమకు దడే అని వాపోతున్నారు. ముంపు భయంతో ఇప్పటికే నాలుగు ఇళ్లు ఖాళీ చేసి.. వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్నామని సవర లక్ష్మి, సవర హరికృష్ణ తదితర గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ నీరు ప్రవహించే సుమారు నెల రోజులపాటు డబార్సింగి, కొయిటాసాయి వంటి ఆరు గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా పోతుందని తెలిపారు. కోతకు గురవుతున్న విషయమై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కనీసం కాలువకు రక్షణ గోడను నిర్మించి ఆదుకోవాలని కోరుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆదుకోవాలి..



చినుకుపడితే భయాందోళన. గ్రామం వద్ద కాలువపూర్తిగా కోతకు గురై ఇళ్లు కొట్టుకుపోయే దుస్థితి నెలకొంది. ఇలాగే ఉంటే కొన్నాళ్లకు గ్రామం ఖాళీచేసి వేరే ప్రాంతాలకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి. అధికారులు, ఎమ్మెల్యే శిరీష స్పందించి మమ్మల్ని ఆదుకొనేలా చర్యలు చేపట్టాలి.

-సవర హిరామణి, గోపాలసాయి గ్రామం

ఐదేళ్లు నిర్లక్ష్యంగా వదిలేశారు..



గ్రామం పరిస్థితిపై గత ఐదేళ్లుగా ఎన్ని ఫిర్యాదు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం స్పందించలేదు. గ్రామం నుంచి కాలువ సుమారు 40 అడుగుల లోతు ఉండటంతో పిల్లలు, మూగజీవాలతో ఇక్కట్లు పడుతున్నాం. వరద వస్తే మేకలు, పశువులు కొట్టుకుపోతున్నాయి. వరదలేని సమయంలో లోతైన కాలువలో పడి ప్రాణాలు కోల్పోతున్నాయి.

-సవర బాలకృష్ణ, గోపాలసాయి గ్రామం

చిన్న ఆలయాలకు ఊరట

(5వ పేజీ తరువాయి) ఎక్కువ. ఇలాంటి ఆలయాల్లో దాతలు కమిటీలుగా ఏర్పడి అర్చకులను నియమించారు. మరికొన్ని చోట్ల పండగ సమయంలోనే అర్చకులను పెట్టి ఉత్సవాలను నిర్వహిస్తున్నా రు. ఆచారం ప్రకారం శిఖర ప్రతిష్ఠ చేసిన ఆలయాల్లో కచ్చితంగా నిత్యం ధూప,దీప, నైవేద్యాలు పెట్టాలి. ఆదాయం లేకున్నా, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. స్థానిక అర్చకులే వీటి నిర్వహణ చేపడుతు న్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయంతో కొంత ఊరట దక్కనుందని అభిప్రాయపడుతున్నారు.

● నిబంధనలివీ..

డీడీఎన్ పథకం వర్తించాలంటే ప్రభుత్వం కొన్ని నిబంధనలు పెట్టింది. దేవదాయశాఖ పరిధిలో ఆలయాలు ఉండి.. 25 ఏళ్ల కిందట నిర్మించినవై ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పురాతన ఆలయాలకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది. రెండున్నర ఎకరాల్లోపు మాగాణి.. లేదా, ఐదు ఎకరాల్లోపు మెట్ట భూమి ఉండి ఏడాదికి రూ.30వేలలోపు ఆదాయం సమకూరే ఆలయాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. పెంచిన రూ.10వేలలో అర్చకులకు రూ.7వేలు చెల్లిస్తారు. మిగతా సొమ్మును ఆలయ నిర్వహణకు కేటాయిస్తారు. ఈ ఆర్థికసాయాన్ని బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తారు.

● కృతజ్ఞతలు..



గ్రామీణ ప్రాంతాల్లో చిన్న దేవాలయాల్లో ధూప,దీప నైవేద్యానికి కూటమి ప్రభుత్వం సాయాన్ని పెంచడం హర్షణీయం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సాయాన్ని పెంచిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు. డీడీఎన్ఎస్ సాయం పెంచడం ద్వారా నిత్యం స్వామివారికి నైవేద్య కార్యక్రమాలు నిర్వహించవచ్చు.

- రామచంద్ర పాణిగ్రాహి, అర్చకుడు

జట్కా బండి.. కనుమరుగైందండీ!

నరసన్నపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు రిక్షాలు లేకుంటే జట్కా బళ్లే కనిపించేవి. జమిందారులు సైతం జట్కా బళ్లలోనే ప్రయాణించేవారు. కాలక్రమంలో వాటికి ఆదరణ తగ్గింది. 20 ఏళ్ల కిందట నరసన్నపేట పట్టణం నుంచి చల్లపేట, తిలారు రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఎక్కువగా జట్కా బళ్లు తిరుగుతుండేవి. చిన్న పిల్లలు సైతం వీటిలో వెళ్లేందుకు మక్కువ చేసేవారు. ఇతర రవాణా సదుపాయాలు పెరగడంతో ప్రస్తుతం జట్కా బళ్లు కనిపించడం లేదు. వీటిపై ఆధారపడిన వారు సైతం ఇతర మార్గాలను ఎంచుకున్నారు. దీంతో జట్కా బళ్లు కనుమరుగయ్యాయి.



తిలారు ఆర్ఎస్ నుంచి నరసన్నపేట తిరిగిన జట్కాబండి (ఫైల్)

పంటకు చీరే రక్షణ

నరసన్నపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి)



ఈ చిత్రాలు చూస్తున్నారుగా.. ఇదేంటి ఇలా వరి పంటలకు చీరలను కట్టారని అనుకుంటున్నారా..?. ఈ చీరలు ఏ ప్రదర్శనకో కట్టారనుకుంటే పొరపాటే. పంటలను అడవి పందుల నుంచి రక్షించుకునేందుకు ఇలా చీర్లను కట్టారు. ఇన్ని చీరలు ఎలా సంపాదించారోనని అనుమానమా? కొన్ని పాత చీరలను భద్రపరిచి., ఇంకొన్ని గ్రామాల్లో మధ్యవర్తుల ద్వారా కొనుగోలు చేసి ఇలా పంటల చుట్టూ కట్టడం పరిపాటిగా మారింది. వంశధార నది ఒడ్డున ఉన్న జీడితోటల్లో అడవి పందులు ఆవాసం ఏర్పాటు చేసుకుని చుట్టుపక్కల పొలాల్లోని పంటలను పాడుచేస్తున్నాయి. అందుకే పంట రక్షణ కోసం ఇలా చీరలను కట్టామని పోతయ్యవలస, మడపాం, గోపాలపెంట తదితర గ్రామాల ప్రజలు చెబుతున్నారు. పోతయ్యవలస వద్ద కనిపిస్తున్న ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది.



పోతయ్యవలస వద్ద వరిపైరుకు చీరలతో ఇలా రక్షణ

న్యూస్ బాక్స్

విద్యార్థిని ఆత్మహత్యపై నివేదిక అందించండి

అరసవల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పాతపట్నం సమీపంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యపై సత్వర నివేదిక అందించాలని విద్యాశాఖ, ఐటీడీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి మృతికి గల ఇతర కారణాలుంటే తెలియజేయాలని కోరారు. అలాగే విద్యార్థినికి ఆసుపత్రి సిబ్బంది అందించిన వైద్యసేవలపై పూర్తి వివరాలను అందజేయాలన్నారు. అధికారులు సమర్పించే నివేదిక ఆధారంగా కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో చర్యలకు ఉపక్రమిస్తామని తెలిపారు.

ప్రమాదాల నియంత్రణకు కృషి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలతో పాటు, నేర నియంత్రణకు కృషి చేస్తానని శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ కె.రాము తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రామును శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయకుమార్ తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్సు కలిగి, 21 సంవత్సరాలు నిండి, ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారు ఈ శిక్షణకు అర్హులని అన్నారు. శిక్షణ మొత్తం 40 రోజుల పాటు ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు పొందాలని కోరారు. మరిన్ని వివరాలకు 8074640792, 7382923293 నెంబర్లను సంప్రదించాలన్నారు.

చెరువు స్థలంలో రోడ్డు నిర్మాణం

పొందూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గోకర్ణపల్లి గ్రామంలో సచివాలయానికి వెళ్లే రోడ్డును చెరువుగర్భం పూడ్చి నిర్మించినట్టు అధికారులు గుర్తించారు. ఈ రోడ్డుపై గోకర్ణపల్లి గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు ఇటీవల గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దార్ వెంకటేశ్ రామానుజులు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. చెరువు గర్భాన్ని పూడ్చి, నిర్మాణం చేపట్టినట్లు గ్రామస్థులు తెలియజేశారు. విచారణ చేసిన అధికారులు.. ఈ రోడ్డు చెరువు గర్భంలోనే ఉన్నట్టు గుర్తించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

సోంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత జాతీయ బీమా సంస్థ ఇటీవల తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆల్ఇండియా ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ పిలుపుమేరకు సోంపేట బ్రాంచ్ ఏజెంట్లు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పాలసీల మీద జీఎస్టీ రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.వసంతరావు, జీ.పద్మలోచన, జీ.రామమూర్తి, ఎం.వెంకటరమణ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ని కలిసిన రమణయ్య



అధికారులను సత్కరిస్తున్న రమణయ్య

అరసవల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యునిగా ఇటీవల ఎన్నికైన శీర రమణయ్య స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, రవీంద్రలను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వారిని దుశ్శాలువతో సత్కరించారు.

గ్రీవెన్స్ ఫిర్యాదుపై విచారణ

కంచిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గోకర్ణపురం పంచాయతీ శాసనాం గ్రామానికి ఆర్.ఉమాపతి అనే వ్యక్తి తన భూమికి సంబంధించి అడంగల్ తన పేరుపై రావట్లేదని ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ శుక్రవారం ఆ గ్రామంలో విచారణ చేపట్టారు. సంబంధిత వ్యక్తులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ సంతోష్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీకూర్మనాథుని దర్శించుకున్న రామచంద్రపురం ఆర్డీవో

గార, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మనాథ క్షేత్రాన్ని కాకినాడ జిల్లా రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్ శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఆలయ ఈవో జి.గురునాథరావు వారికి అందజేశారు. ప్రధాన అర్చకుడు సీతారామ నరసింహాచార్యులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఒరిగిన విద్యుత్ స్తంభాలు

» పట్టించుకోని అధికారులు

గార, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బోరవానిపేట పంచాయతీ తాళ్లవలస గ్రామంలో అమ్మవారి ఆలయానికి వెళ్లేదారిలో పొలంలో రెండు విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయి కనిపిస్తున్నాయి. ప్రమాదం జరగకముందే సంబంధిత శాఖ అధికారులు వీటిని సరి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పక్కకు ఒరిగిపోయి ఉన్న విద్యుత్ స్తంభాలు

రహదారి మధ్యలో గొయ్యి

లావేరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుభద్రాపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారికి ఆనుకుని లావేరు వైపు వెళ్లే రహదారి మధ్యలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో గొయ్యి ఏర్పడడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ శాఖాధికారులు స్పందించి ఈ గొయ్యిని పూడ్చాలని పలువురు కోరుతున్నారు.



లావేరుకు వెళ్లే దారిలో ఏర్పడిన గొయ్యి

సమస్యలు ఉంటే సంప్రదించండి: ఎస్పీ



సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది వ్యక్తిగత, ఆరోగ్య, వృత్తిరీత్యా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే సాధ్యాసాధ్యాలు పరిశీలించి, పరిష్కరిస్తానని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బందికి గ్రీవెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ సిబ్బందికి ఎటువంటి సమస్య ఉన్నా నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. అత్యవసర సమయాల్లో ఫోన్ ద్వారా కూడా విషయాన్ని తెలియపర్చవచ్చని చెప్పారు. సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన పోలీసు అధికారులు

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని ఆయన చాంబర్‌లో పలువురు పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చిన డీపీటీసీ సీఐ ఎం.కృష్ణమూర్తి, టాస్క్ ఫోర్స్ సీఐ ఎస్.కృష్ణారావు, డీటీఆర్బీ ఎస్ఐ ఎ.కోటేశ్వర రావు ఎస్పీని కలిసి, పూల మొక్కలను అందించారు.

చోరీ సొత్తు రికవరీ

పొందూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తిరుమల బంగారం వెండి ఆభరణాల దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళలను స్థానిక పోలీసులు శుక్రవారం అరెస్టుచేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 9వ తేదీన మండల కేంద్రం పొందూరులోని తిరుమల ఆభరణాల దుకాణంలో విశాఖపట్టణం అల్లిపురానికి చెందిన షేక్‌బాను, దేశిరాజు ధనలక్ష్మి అనే ఇద్దరు మహిళలు ఆభరణాల దుకాణంలో కొనుగోలు వచ్చినట్లు నమ్మించి 60 తులాలు (700)గ్రాముల వెండి పట్టీలను దొంగిలించారు. సీసీ టీవీ ఫుటేజీలో వెండి పట్టీలు దొంగిలించినట్టు గుర్తించిన దుకాణ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు మహిళలను గుర్తించి ఆభరణాలను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశారు. చోరీకి పాల్పడిన మహిళలను, వెండి వస్తువులను ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ విలేకర్ల సమావేశంలో ప్రవేశపెట్టారు. చోరీకి పాల్పడినవారిని వేగంగా పట్టుకున్నందుకు పొందూరు ఎస్ఐ, సిబ్బందిని సీఐ అభినందించారు.

మార్కుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికావాలి

పొందూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు మార్కుల ఆన్‌లైన్ ప్రక్రియతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన అన్ని పనులను సకాలంలో పూర్తిచేయాలని శ్రీకాకుళం జిల్లా ఉప విద్యా శాఖాధికారిణి ఆర్.విజయకుమారి ఆదేశించారు. మండలంలోని రాపాక, తోలాపి జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుల డైరీ, లెసన్ ప్లాన్‌లను ఎండీఎం రికార్డులను పరిశీలించారు. పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షించాలని హెచ్ఎం సత్యరాజుకు సూచించారు.

'స్వాభిమాన్'ను వినియోగించుకోవాలి

» కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 18: దివ్యాంగులు ఎందులోనూ, ఎవ్వరికీ తీసిపోరని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రతి నెల మూడో శుక్రవారం 'స్వాభిమాన్' పేరిట వినతులు స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి 31 వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు. ప్రతి అర్జీని సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి, పరిష్కారం చూపాలన్నారు. తొలుత కలెక్టర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవిత, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, రిమ్స్ సూపరింటెండెంట్ డా.షకీలా, డీసీహెచ్ఎస్ డా.కళ్యాణబాబు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డ్వామా పీడీ సుధాకర్, డీపీవో కె.భారతీ సౌజన్య, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ చట్టం.. చారిత్రక నిర్ణయం

అరసవల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల ప్రజలకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించడమే లక్ష్యంగా బీసీ రక్షణ చట్టం రూపొందిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం శుభ పరిణామమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బుడుమూరు రాజేష్ అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ చట్టం బీసీలకు రక్షణ కవచం లాంటిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో కులగణన త్వరగా చేపట్టాలని, చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కులపరంగా, వ్యక్తిగతంగా దూషించిన వారిపై చర్యలు తీసుకునేలా చట్టంలో చర్యలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సీనియర్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జనావాసాల మధ్య మద్యంషాపు వద్దు



ఎక్సైజ్ అధికారులను నిలదీస్తున్న మహిళలు

ఎచ్చెర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం గ్రామం మునిపేటకు పోయే రహదారిలో జనావాసాల మధ్య మద్యంషాపును ప్రారంభించడం పట్ల స్థానిక మహిళలు ఆందోళనకు దిగారు. ఈ మద్యంషాపు ఏర్పాటును పరిశీలించేందుకు శుక్రవారం సిబ్బందితో కలిసి వచ్చిన ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ ఎదుట మహిళలు తమ నిరసన వ్యక్తంచేశారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఇక్కడ మద్యం షాపును ఉంచొద్దని, వేరే చోటకు తరలించాలని కోరారు. దీనిపై సీఐ గోపాలకృష్ణ స్పందిస్తూ.. పూర్తిస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని, ఈ విషయంలో ఆందోళన చెందొద్దని స్పష్టంచేశారు. దీంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది.

తుఫాన్ ప్రభావిత మండలాలకు
ప్రత్యేక అధికారులు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలోని 11 తీరప్రాంత మండలాలకు ప్రత్యేక పర్యవేక్షక అధికారులను నియమిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు జారీ చేశారు. వీరంతా ఆయా తీర ప్రాంత మండలాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రణస్థలం మండలానికి డీఆర్డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ (8008803800), ఎచ్చెర్లకు డ్వామా పీడీ బి.సుధాకరరావు (8790008399), శ్రీకాకుళం మండలానికి డీపీవో కె.భారతి సౌజన్య (83414 93877), గారకు ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ(94408 14582), పోలాకి జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు (9100997770), సంతబొమ్మాళికి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఉమామహేశ్వరరావు (9866530885), వజ్రపు కొత్తూరుకు మత్స్య శాఖ డీడీ పీవీ శ్రీనివాసరావు (94407 16028), సోంపేటకు కార్మిక శాఖ ఏసీ అజయ్ కార్తికేయ (94925 55034), మందసకు పశుసంవర్థకశాఖ ఏడీ పి.చంద్రశేఖర్ (9492416700), కవిటికి ఉద్యానశాఖాధికారి ఆర్వీ ప్రసాద్ (7995086758), ఇచ్ఛాపురానికి డ్వామా ఏపీడీ సీహెచ్.శ్రీనివాసరెడ్డి (6309998070)లను తుఫాన్ పర్యవేక్షక అధికారులుగా నియమించారు.

గంజాయితో నలుగురు అరెస్టు

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నలుగురు యువకులు గంజాయి తరలిస్తుండగా రెండో పట్టణ పోలీసులు వారిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన తుపాకుల సువార్తరాజు, ఆది సాయి షణ్ముఖ, సీరపు కౌశిక్‌తో పాటు ఓ మైనర్ కేజీ గంజాయిని విక్రయించేందుకు జాతీయ రహదారిపై ఉన్న విజయాదిత్య పార్క్ మార్గం మీదుగా శ్రీకాకుళం వస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ ఆర్.సంతోష్, క్రైం సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. విజయాదిత్య పార్కు వద్ద ఆ నలుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని విచారించారు. వారి దగ్గర ఒక కేజీ గంజాయి లభించడంతో స్టేషన్‌కు తరలించారు. అక్కడ విచారించగా శ్రీకాకుళంలో గంజాయి విక్రయించేందుకు వెళ్తున్నట్టు ఆ నలుగురు అంగీకరించారు. ఆ నలుగురుపై కేసు నమోదు చేయగా వీరిలో ఒక మైనర్ బాలుడు ఉండటంతో అతడిని రీహేబిటేషన్ సెంటర్‌కు తరలించనున్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

ఆమదాలవలస, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాధ్యతగల ప్రతిపక్షంగా ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేద్దామని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం ఆమదావలస మండలం, మున్సిపాలిటీ పరిధిలో వైసీపీ క్యాడర్‌తో స్థానిక ప్రైవేటు కళాశాల మండపంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. తమ్మినేని చిరంజీవినాగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'సంపూర్ణత అభియాన్'

పర్లాకిమిడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యా ఆరోగ్యం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, సామాజిక అభివృద్ధి వంటి వివిధ శాఖల్లో ఆరు సబ్ సెక్టర్లలో గడిచిన మూడు నెలలో శత శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామని కలెక్టర్ విజయకుమార్ దాస్ తెలిపారు. జడ్పీ సమావేశ భవనంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి సంపూర్ణత అభియాన్ సమాపాన్ సమరోహ ముగింపు ఒడిశా కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మూడు నెలల గర్భిణులను ఆరోగ్యశాఖ సిబ్బంది సకాలంలో గుర్తించి, వారికి ఆరోగ్య సేవలు అందించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలను అంగన్‌వాడీ, ఆశావర్కర్లను సన్మానించారు. జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతి, జడ్పీ కార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, జిల్లా ముఖ్య వైద్యాధికారి ఆలీ, జిల్లా వ్యవ సాయశాఖ అధికారి నరేంద్రనాద్ స్వైన్ పాల్గొన్నారు.

ప్రమాదపు అంచున..

» వంతెనపై అదుపు తప్పిన లారీ

బూర్జ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం, లాభాం గ్రామాల పరిధిలోని గెడ్డ వంతెనపై శుక్రవారం ఓ లారీ అదుపు తప్పి పక్కకు ఒరిగింది. దీంతో వంతెన రక్షణగోడ కూలిపోయింది. కాగా లారీ వంతెనపై నుంచి పడకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు అన్నారు. వర్షం కారణంగా వంతెనపై బురదగా ఉండడంతో ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. నిత్యం ఈ ప్రాంతం నుంచి ఇసుక లారీలు వెళుతుంటాయి. ఇప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



నారాయణపురం వద్ద వంతెనపై అదుపు తప్పిన లారీ

నాటిక పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం సూత్రా ఫౌండేషన్, శ్రీ సుమిత్రా కళా సమితి ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాటిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా మందసకు చెందిన అభినయ ప్రియ నాటక నర్తనశాల ఆధ్వర్యంలో మీగడ రామలింగస్వామి రచనలో ఎస్.పట్టాభిరామారావు దర్శకత్వంలో అంతర్ముఖం నాటిక ఎంతగానో అలరించింది. అదేవిధంగా ఆమదాలవలసకు చెందిన శ్రీవేంకటేశ్వర కళామండలి ఆధ్వర్యంలో కుప్పిలి వెంకట రాజారావు రచన, దర్శకత్వంలో పులి కాలం నాటికను ప్రదర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో పూర్వ సీఈవో సురంగి మోహనరావు, పైడిశెట్టి జయంతి, విశ్రాంత ఆర్డీవో పీఎంజే బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా విచారణ జరిపితే ఎలా?

సరుబుజ్జిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కూనజమ్మన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విచారణ ఏకపక్షంగా ఉందని టీడీపీకి చెందిన కె.అమ్మినాయుడు, జి.రవికుమార్ అభ్యంతరం తెలిపారు. వారు విలేకర్లతో మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్ర ఆయా నియామ కంలో ఐసీడీఎస్ అధికారులు నిబంధనలు పాటించలేదని ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే ఫిర్యాదుపై విచారణ చేపట్టిన బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఫిర్యా దుదారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కేవలం వైసీపీకి చెందిన కొంతమంది వ్యక్తులతో ఏకపక్షంగా విచారణ జరపడంలో ఆంతర్యమేమిటని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఐసీడీఎస్ అధికారులతో పాటు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసి కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు.

రసాభాసగా మండల సమావేశం

రణస్థలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం రసాభాసాగా మారింది. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ పి.రజినిసాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి భానూజీనాయుడు కల్పించుకుని.. సభ్యులు కానివారు సమావేశంలో మాట్లాడడం ఎందుకని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావును ప్రశ్నించారు. తాను ఎంపీటీసీ ప్రతినిధినని, తనకు ప్రశ్నించే హక్కు ఉందని మజ్జి రమేష్ అన్నారు. దీంతో సర్పంచ్ భానూజీ నాయుడు, రమేష్ ఒకరిని ఒకరు దూషించుకున్నారు. దీంతో సభ్యులందరూ లేచిపోయారు. దీంతో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు పి.సాయికుమార్ ఇద్దరు వ్యక్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులు రావడంతో వివాదం సద్దుమనిగింది.

మినీ జాబ్‌మేళాకు 21 మంది ఎంపిక

ఎచ్చెర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాకు 3 ప్రైవేటు సంస్థల నుంచి ప్రతినిధుల హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 78 మంది అభ్యర్థులు హాజరు కాగా 21 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెట్‌శ్రీ మేనేజర్ కె.అప్పలనాయుడు, వర్సిటీ టీపీవో విద్యాసాగర్ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానికంగానే జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, ప్లేస్‌మెంటు అధికారి వంశీకృష్ణ, యూఎస్‌డీవో శ్రీవాణి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఎన్టీఆర్ కాలనీలో చోరీ


పగులగొట్టి ఉన్న బీరువా

టెక్కలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ ఐదో లైన్‌లో దండుమూర్తి యమున ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో మూడు తులాల బంగారం, రూ.60 వేలు నగదు అపహరణకు గురైనట్లు ఆమె శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో జీడీ ఏగా పనిచేస్తున్న యమున గురువారం రాత్రి పిల్లలను బంధువుల ఇంట్లో ఉంచి రాత్రి విధి నిర్వహణకు వెళ్లడంతో దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాను తెరిచి చోరీకి పాల్పడ్డారు. ఈమె భర్త విశ్వేశ్వరరావు ఓ ఏజెన్సీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నారు. చోరీ విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్‌టీమ్ బృందాన్ని పంపి వేలిముద్రలు సేకరించారు. వాస్తవానికి శుక్ర వారం ఉదయం 20 తులాల బంగారం, ఐదు తులాల వెండి, రూ.60 వేల నగదు చోరీకి గురైనట్లు యమున పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే క్లూస్‌టీమ్ బీరువాను పరిశీలించిన తరువాత బీరువాలో బంగారం, వెండి కొంతమేర ఉన్నట్లు గుర్తించారు. చివరకు మూడు తులాల బంగారం, రూ.60 వేల నగదు చోరీ అయినట్లు ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రఘు నందనరావు తెలిపారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

టెక్కలి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీ భూలోకమాత వీధికి చెందిన పూల వ్యాపారి బాడా రిషీకేష్ (42) మండాపొలం కాలనీ నాల్గో లైన్‌లో మురికి కాలువలో పడి మృతి చెందాడు. అయితే మృతదేహాన్ని స్థానికులు ఇందిరాగాంధీ కూడలిలోని శ్మశాన వాటికకు తీసుకువచ్చి దహన సంస్కారాలు ప్రారంభించారు. మృతదేహం సగం కాలిన తరువాత సమాచారం తెలుసుకున్న పోలీసులు మంటలను ఆపి ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రి కి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ రఘునందనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై యువకుడి దాడి

హిరమండలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం-2 డిపో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఓ యువకుడు దాడిచేసిన ఘటన హిరమండలంలో సంభవించింది. కండక్టర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం హిరమండలం బ్యారేజీ సెంటర్‌లో బస్సు ఆగింది. ప్రయాణికులు బస్సు నుంచి కొందరు దిగగా మరి కొందరు బస్సులోకి ఎక్కారు. దీంతో డ్రైవర్ బస్సును తీయగా బస్సు కదులుతుండగా ఒక యువకుడు అమ్మాయితో వచ్చి చెయ్యి ఊపుతూ ఆపేందుకు ప్రయత్నించాడు. దీనిని గమనించిన డ్రైవర్ బస్సును నిలపకుండా ముందుకు పోనిచ్చాడు. ఇదిలా ఉండ గా హిరమండలం బస్టాండ్‌లో బస్సు నిలపగా బస్సు వెనకాలే బైక్‌పై వచ్చిన ఆ యువకుడు బస్సు లోపలికి వెళ్లి డ్రైవర్‌పై దాడి చేశాడు. డ్రైవర్‌కు గాయాలు కాగా కండక్టర్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్స చేయించారు. ఈ విషయమై ఎస్‌ఐ ఎండీ యాసిన్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

హిరమండలం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): చొర్లంగి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి ఎస్‌ఐ ఎండీ యాసిన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.40,900తో పాటు 8 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

కి'లేడీ' వ్యవహారంపై బాధితుల ఆగ్రహం

సంతబొమ్మాళి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నౌపడ గ్రామానికి చెందిన ఓ కి'లేడీ' బంగారు బిస్కట్లు ఆశ చూపి రూ.కోటి దోచుకుని మోసం చేసిన ఘటనపై బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. తన మాటల గారడీతో బాధితులకు కుచ్చుటోపీ పెట్టింది. ఈ వ్యవహారంపై గత డిసెంబరులో టెక్కలి పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. అయితే పెద్ద మనుషుల వద్ద ఒప్పందం మేరకు నేటికీ బంగారం ఇవ్వకపోవడంతో పెద్దమనుషులు, మీడియా ఎదుట శుక్రవారం బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వ హయాంలో నౌపడకి చెందిన ఓ చోటా నాయకుడు ఈ వ్యవహారంలో పెద్దరికం వహించినట్లు ఆరోపణలు గుప్పుమన్నాయి. వివరాలిలా ఉన్నాయి. నౌపడ ప్రాంతానికి చెందిన ఓ మహిళ బంగారు బిస్కట్లు, బంగారు విగ్రహ ప్రతిమలు ఇప్పి స్తానని నౌపడ, టెక్కలి విశాఖ ప్రాంతాల్లో చాలామంది నుంచి భారీగా నగదు వసూలు చేసింది. బ్యాంక్‌లో తన భర్త పనిచేస్తున్నాడని, హైదరాబాద్‌లోని ఓ బ్యాంక్‌లో బంగారు బిస్కట్లు గతంలో వేలంలో పాడుకున్నానని, తనకు డబ్బులు అవసరముందని, అందుకే కిలో బంగారు బిస్కట్లు రూ.10 లక్షలకు అమ్ముతున్నట్లు పలువురిని బురిడీ కొట్టించింది. అయితే ఎప్పటికీ బంగారు బిస్కట్లు ఇవ్వకపోవడంతో మోసపోయామని పలువురు మహిళలు గ్రహించారు. సంబంధిత మహిళ నౌపడ గ్రామానికి చెందిన ముగ్గురి నుంచి రూ.57 లక్షలు, టెక్కలికి చెందిన ఓ మహిళ నుంచి రూ.37లక్షలు, ఇతరుల నుంచి మరికొంత మొత్తం వసూలు చేసి ఎప్పటికీ బంగారు బిస్కట్లు ఇవ్వలేదు. దీంతో ఆమెను బాధితులు నిలదీశారు. ఈ నేపథ్యంలో పెద్ద మనుషుల వద్ద పంచా యతీ పెట్టారు. అయితే ఈ విషయం బయటకు రానీయకుండా పెద్ద మనుషులు ఆమె నుంచి ముడుపులు తీసుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. గత డిసెంబరులో టెక్కలిలో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదని వాపోయారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బాధితులంతా సదరు పెద్ద మనుషుల వద్ద తమ ఆవేదనను వ్యక్తంచేశారు. తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.


ప్రభుత్వ నిర్దేశాలకు అనుగుణంగా పనిచేయాలి


మాట్లాడుతున్న డిప్యూటి డీఈవో విలియమ్స్

మెళియాపుట్టి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో ప్రభుత్వం తీసుకు వస్తున్న మార్పులు, నిర్దేశాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేయాలని డిప్యూటీ డీఈవో విలియమ్స్ అన్నారు. శుక్రవారం పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులపై ఇప్పటినుంచే దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనంలో మెనూ సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు దేవేంద్ర రావు, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరాలయంలో ఆకాశ దీపోత్సవం

● ఒడిశా సంప్రదాయం ప్రకారం కార్తీకమాసం ప్రారంభం



జలుమూరు, అక్టోబరు 18: (ఆంధ్రజ్యోతి) దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయంలో శుక్రవారం రాత్రి ఆకాశ దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పర్లాకిమిడి రాజు పేరున స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఒడిశా రాజులు ఈ ఆలయాన్ని పునర్నిర్మించడంతో అప్పటి నుంచి ఒడిశా సంప్రదాయాలను ఇక్కడ ఆచరిస్తున్నారు. ఆశ్వీయుజ బహుళ పాడ్యమి నుంచి కార్తీకమాస పౌర్ణమి వరకు నెల రోజులు ఒడిశా సంప్రదాయం ప్రకారం కార్తీక పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా కార్తీక దీపాన్ని వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అప్రోచ్ పూర్తయ్యేదెప్పుడో?

● రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న 30 గ్రామాల ప్రజలు


నువ్వలరేవు వంతెన వద్ద నిలిచిన అప్రోచ్ రోడ్డు పనులు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నువ్వలరేవు ఉప్పుటేరుపై నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు పూర్తి చేయకపోవడంతో లక్ష్యానికి తూట్లుపడుతున్నాయి. గత టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ హయాంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆయన చొరవతో రూ.50 కోట్లతో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో వంతెన నిర్మాణం చేపట్టారు. వంతెన పూర్తయినా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిన నేపథ్యంలో వైసీపీ ప్రజా ప్రతినిధులు వంతెన పూర్తికి హామీ లిచ్చినా పనులు ముందుకు సాగలేదు. దీంతో సుమారు 30 గ్రామాల ప్రజ లు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే 105 ఇళ్ల తొలగించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే నువ్వలరేవు గ్రామానికి సమీపం లోనే వసతి కల్పించాలని నిర్వాసితులు పేర్కొంటుండడంతో అధికారులు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో అర్ధంతరంగా నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ విక్రమ్ వద్ద ప్రస్తావించగా.. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామని, ముందుగా నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉందన్నారు. 105 ఇళ్ల తొలగించాల్సి ఉందని, ఆ తదుపరి రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

టెక్కలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు సముదాయంలో డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నామని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకునేలా అవగాహన కలిగించాలన్నారు.బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద,న్యాయవాదులు పాల్గొన్నారు.


టెక్కలి: వస్తువులను తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు


జలుమూరు: హాస్టల్ సిబ్బందికి సూచనలిస్తున్న న్యాయాధికారి ప్రసన్నలత

వసతిగృహాల సందర్శన

టెక్కలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం టెక్కలి లోని ప్రభుత్వ కళాశాలల బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను టెక్కలి సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు సందర్శించారు. వసతిగృహాల స్థితిగతులను పరిశీలించారు. పిల్లల వసతులు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, వైద్యం, వసతి గదులు, వంట శాలలను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిర్దేశించిన మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం ఇస్తున్నారా లేదా అనే విషయమై ఆరా తీశారు. పిల్లలకు సదుపాయాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు హాస్టల్ సిబ్బంది ఉన్నారు.

సౌకర్యాలు లేకపోవడంపై అసంతృప్తి

జలుమూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగం ప్రభుత్వ బీసీ వసతి గృహంలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడంపై కోటబొమ్మాళి జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఇక్కడ 82 మంది విద్యార్థులున్నప్పటికీ మరుగుదొడ్లు, స్నానపు గదులు నాలుగైదు మాత్రమే ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. అలాగే భోజనాల గదుల్లోనే విద్యార్థులు పడుకుండడాన్ని గమనించారు. తక్షణం తగు చర్యలు తీసుకుని సదుపాయాలకల్పించాలని సంక్షేమాధికారికి ఆదేశించారు. అలాగే జలుమూరులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం, బీసీ వసతిగృహాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

మునగాకుతో ఎంతో ప్రయోజనం

పాతపట్నం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మునగాకును వినియోగించడం ద్వారా మహిళలకు ఎంతో ప్రయోజనకరమని ఐసీడీఎస్ పీవో టి.విమలారాణి అన్నారు. మండలంలోని పలు అంగన్ వాడీ కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులు మున గాకును ఆహార పదార్థాలతో కలిపి తినడం ద్వారా హిమోగ్లోబిన్ పెరగడంతో పాటు కాల్షియం లోపాలను అధిగమించవచ్చన్నారు. రక్తహీనత లేకుండా ఉంటుందన్నారు. ఈ విషయాలపై గర్భిణులు, బాలింతలు, కిశోరీ బాలికలకు అవగాహన కలిగించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.అనూరాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

కాశీబుగ్గ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్య సదుపాయాలు అవసరమైన వారికి 108 ద్వారా మెరుగైన సేవలు అందించాలని పలాస డివిజన్ 108 ఆపరేషన్స్ అధికారి గండేపల్లి జగన్నాథరావు అన్నారు. శుక్రవారం పలాసలో 108 వాహన నిర్వాహణ, పరికరాల పనితీరు, మందుల రికార్డుల నిర్వహణ, డ్యూటీ చార్టులను పరిశీలించారు. అత్యవసర సమయంలో మరింత బాధ్య తగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యం, తారకేశ్వరరావు, మోహన్ రావు, వెంకటరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

108 సేవలపై ఆరా

నందిగాం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో 108 వాహన సేవలపై సంబంధిత ఆపరేషన్స్ అధికారి జి.జగ న్నాథరావు ఆరా తీశారు. శుక్రవారం నందిగాంలో 108 వాహనాన్ని తనిఖీ చేశారు. నవజాత శిశువులకు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈఎన్‌టీ బి.రాము, పైలెట్ వి.కుమారస్వామి ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఓటు నమోదు చేసుకోవాలి

టెక్కలి, అక్టోబరు 18: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఎన్నికలు జరగను న్నందున అర్హులు ఓటుహక్కు కోసం నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. నవంబరు 20వ తేదీలోగా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఓటు నమోదుకు అర్హులన్నారు. అలాగే అధ్యాపకులు కూడా అర్హులేనని, సొంత మండలాల్లో తమ నమోదును చేసుకోవాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

హిరమండలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్. కాశీ ప్రసాద రావు తెలిపారు. ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన జరుగు ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

కాశీబుగ్గ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.మోహన్‌రావు, జిల్లా కమిటీ సభ్యురాలు కె.నాగమణి అన్నారు. శుక్రవారం మహాసభల సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ వెంటనే పూర్తి చేసి మున్సిపాలిటీకి తాగునీరు అందించాలని, పెండింగ్‌లో ఉన్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పూర్తి చేయాలని, జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గణపతి, అజయ్ కుమార్, కృష్ణారావు, పరుశురామ్, భాగ్యలక్ష్మి లావణ్య పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


ఎస్పీకి ఫిర్యాదు ఇస్తున్న జనసేన నాయకులు

పలాస, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో త్వరిత గతిన పరిష్కరిస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫిర్యాదులపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆయన పోలీసు అధికా రులను ఆదేశించారు. మొత్తం 11 ఫిర్యాదులు అందాయి.

జనసేన నాయకుడికి బెదిరింపులపై ఫిర్యాదు

జనసేన పలాస ఇన్‌చార్జి వి.దుర్గారావును కొందరు ఆకతాయిలు వాట్సాప్ ఫోన్లు చేసి బెది రింపులకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్య దర్శి ఎల్.సురేష్‌కుమార్, నేతలు కోన కృష్ణారావు, దువ్వాడ వంశీకృష్ణ చౌదరి కోరారు. ఈ మేరకు ఎస్పీ మహేశ్వర రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్.ధర్మారావు, పి.నాగార్జున, తులసీరావు, మిన్నారావు పాల్గొన్నారు.

నూతన విధానాలను ఉపసంహరించుకోవాలి



ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు

కాశీబుగ్గ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సంస్థ మనుగడకు ముప్పు తెచ్చేలా ఎల్ఐసీ సంస్థ అనేక మార్పులకు శ్రీకారం చుట్టిందని, వీటిని తక్ష ణం వెనక్కు తీసుకోవాలని పలాస బ్రాంచి ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు జినగ రాజేంద్రనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాలయం ఎదుట ఆల్ ఇండియా ఎల్‌ఐసి ఏజెంట్స్ యూనియన్ సంఘం పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. 68 ఏళ్లుగా ఉన్న ఎల్‌ఐసీ పద్ధతుల్లో మార్పులు తీసుకువచ్చి ఇబ్బందు లకు గురిచేస్తున్నారన్నారు. పాలసీపై జీఎస్టీ పెంపు, మెచ్యూ రిటీ బోనస్ తగ్గించడం, ఎంట్రీ వయసు 50 ఏళ్లకు తగ్గిం చడం, ప్రీమియం రేట్లు పెంచడం వల్ల ఇబ్బందులు ఎదు రవుతున్నాయన్నారు. తక్షణం నూతన విధానాలను ఉప సంహరించు కోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ నాగేశ్వరరావు, వాసుదేవ్, ఈశ్వరరావు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలి

నరసన్నపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక కార్యాలయం వద్ద గురువారం ఎల్‌ఐసీ ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు కొత్తవ్యాపారాలను ఏజెంట్లు చేయవద్దని తీర్మానించారు. సంఘ నాయకులు పూర్ణారావు, గడ్డేసు, మెండ చిన్నవాడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

● పశుసంవర్ధక శాఖ జేడీ మురళీధర్


లేగదూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతి అందిస్తున్న జేడీ మురళీధర్

నందిగాం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోం దని పశుసంవర్ధక శాఖ జేడీ మురళీధర్ అన్నారు. శుక్రవారం దిమ్మిడిజోలలో లేగదూడల ప్రదర్శన, గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడ దూడల పుట్టుకతో పాడి రైతులకు లక్ష్మీ కళ సాధ్యపడుతుందన్నారు. తమ శాఖాధికారులు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించి పాడి ప్రగతిని సాధించాలని కోరారు. ఈ సందర్భంగా 80 పశువులకు గర్భకోశ వ్యాధి, చూడి పరీక్షలు చేశారు. లేగదూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందించారు. సామూహిక నట్టల నివారణ మందు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఏడీ ఎం.రవికృష్ణ, టెక్కలి డీడీ వి.జయరాజ్, పశువైద్యాధికారి జి.మన్మథరావు, టీడీపీ నాయకులు పి.అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థిని మృతికి పాఠశాల సిబ్బందే కారణం'

పాతపట్నం,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని సవర లావణ్య మృతికి పాఠశాల సిబ్బందే కారణమని ఏబీవీపీ ప్రతినిధులు అన్నారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఎదుట శుక్రవారం రాత్రి ధర్నా నిర్వహించారు. బాధ్యులైన సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సిగిలిపల్లి మదన్‌కుమార్, పాతపట్నం టౌన్ కన్వీనర్ సంతోష్ డిమాండ్ చేశారు. ధర్నా వద్దకు పోలీసులు చేరుకొని ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు.

జీడి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న తెప్పల అజయ్‌కుమార్

కాశీబుగ్గ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో జీడి రైతులకు కూటమి నేతలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జీడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇప్పటి సీఎం చంద్రబాబు జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించి, జీడి అభివృద్ధి బోర్డు, కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకుడు మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి

పలాసరూరల్,అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతాంగ సాధన కమిటీ సభ్యులు దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు కోరారు. ఈ మేరకు బొడ్డపాడు అమరవీరుల స్మారకభవనంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. నాలుగు దశాబ్దాలుగా జీడికి గిట్టుబాటు ధరపై ఉద్యమాలు చేస్తున్నా పాలకులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఆదివారం హరిపురంలో రైతు సదస్సు నిర్వహిస్తున్నామని, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

భూ ఆక్రమణలపై కఠిన చర్యలు

పలాసరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి అన్నారు. శుక్రవారం తన కార్యాల యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు ఆక్రమించిల్లో ఇల్లు కట్టుకోవడం, ఖాళీ స్థలాలను ఆక్రమిం చుకో వడం చట్టరీత్యా నేరమన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం, ప్రభుత్వ అభివృద్ధి కార్యాలయాల కోసం భూమి సేకరణ చేపడుతున్నామన్నారు. పలాస జంట పట్టణాల్లో తాగునీటి ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగించాలి

పోలాకి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటుచేసిన చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్పీవో ఐవీ రమణ ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఇంటిపన్ను వసూలు వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డీ బిపద్మావతి, సూపరింటెండెంట్ బలగ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చెత్తసంపద కేంద్రాలను పరిశీలించారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

జలుమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. చదువుకోని అంగన్ వాడీ ఆయాలు, మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు, స్వయంశక్తి సంఘం సభ్యులను గుర్తించి వారికి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావు, వెలుగు ఏపీఎం హేమసుందర రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ నోటిఫికేషన్‌లో రోస్టర్ ఉత్తర్వులపై హర్షం

జలుమూరు (సారవకోట), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్షాభియాన్ ఉద్యోగాల నియమక నోటిఫికేషన్‌లో రోస్టర్ విధానం పాటించేలా రాష్ట్ర పీడీ ఉత్తర్వులు జారీ చేయడంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగాలు నియామక నోటిఫికేషన్‌లో ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ రోస్టర్ విధానం పాటించకపోవడంపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై కమిషన్ పీడీకి నోటీసులు జారీ చేసి రోస్టర్ విధానం పాటించాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు పీడీ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఎస్టీలకు న్యాయం చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

కోటబొమ్మాళి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందులను జీవాలకు వేయించుకోవాలని పశు వైద్యాధికారి లఖినేని కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పాకివలస, వాండ్రాడ, పెద్దబమ్మిడి, కొత్తపల్లి గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ మందుల వల్ల జీవాల బరువు పెరిగి ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు ముకుందరావు, బలరాం, నరసింహులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

వజ్రపుకొత్తూరు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పంచాయితీ ఎం.గడూరులో రోడ్డు నిర్మాణానికి శుక్రవారం టీడీపీ రాష్ట్రకార్యదర్శి యార్లగడ్డ వెంకన్న చౌదరి భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఉపాధ్యక్షుడు అర్జువెల్లి ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ లైశెట్టి భీమా రావు, సాతుపల్లి కామేశ్వరరావు, పలువురు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీ

సంతబొమ్మాళి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. 'దేవుడు నిజమైన స్నేహితుడు' అన్న అంశంపై జరిగిన వ్యాసరచన పోటీని తెలుగు, ఆంగ్ల మాధ్య మాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు మార్పు నారాయణమూర్తి, హెచ్‌ఎం కోత చైతన్య, ఉపాధ్యాయులు భాస్కరరావు, ఆదికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.